26-10-2022 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - సదా ఈ నషాలోనే ఉండండి, మేము శివ వంశీ బ్రహ్మ ముఖ వంశావళి బ్రాహ్మణులము, మా ఈశ్వరీయ కులము అన్నింటికన్నా ఉన్నతమైనది"

ప్రశ్న:- పైకి ఇంటికి వెళ్ళేందుకు లిఫ్ట్ ఎప్పుడు లభిస్తుంది? ఆ లిఫ్ట్ లో ఎవరు కూర్చోగలరు?

జవాబు:- ఇప్పుడు సంగమయుగములోనే ఇంటికి వెళ్ళే లిఫ్ట్ లభిస్తుంది. ఎప్పటివరకైతే ఎవరైనా తండ్రికి చెందినవారిగా అవ్వరో, బ్రాహ్మణులుగా అవ్వరో అప్పటివరకు లిఫ్ట్ లో కూర్చోలేరు. లిఫ్ట్ లో కూర్చునేందుకు పవిత్రంగా అవ్వండి, రెండవది స్వదర్శన చక్రాన్ని తిప్పండి - ఇవే రెక్కల వంటివి, ఈ రెక్కల ఆధారముగానే ఇంటికి వెళ్ళగలరు.

గీతము:- ఓర్పు వహించు మానవా...(ధీరజ్ ధర్ మనువా...)

ఓంశాంతి. మధురాతి-మధురమైన సంగమయుగీ బ్రాహ్మణులు, ఎవరినైతే స్వదర్శన చక్రధారులు అని అంటారో, వారు ఇప్పుడు గుప్త వేషములో చదువుతున్నారు. వీరు సంగమయుగీ బ్రహ్మ ముఖ వంశావళి అని మిమ్మల్ని ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. పిల్లలైన మీకు తెలుసు, మనం శివ వంశీ బ్రహ్మ ముఖవంశావళి. కావున కులము యొక్క నషా కూడా ఎక్కుతుంది ఎందుకంటే మీరు ఈశ్వరీయ కులానికి చెందినవారు. ఈశ్వరుడే కూర్చుని మిమ్మల్ని తమతోపాటు తీసుకువెళ్ళేందుకు తమవారిగా చేసుకున్నారు. పిల్లలకు తెలుసు, అలాగే తండ్రికి కూడా తెలుసు, ఆత్మ పతితముగా అయిపోయింది, ఇప్పుడు పావనంగా అవ్వాలి. ఇప్పుడు మనం శివ వంశీ బ్రహ్మ ముఖవంశావళి అని పిల్లలకు నిశ్చయం ఏర్పడింది. బ్రహ్మకుమారీ, కుమారులు అని మీకు పేరు కూడా ఉంది. మొత్తం ప్రపంచము శివ వంశీయులు. ఎప్పుడైతే శివబాబాను గుర్తిస్తారో, అప్పుడే బ్రాహ్మణ కుల భూషణులుగా కూడా అవుతారు. ఈ సమయంలో మీరు సాకారములో బాబాకు చెందినవారిగా అయ్యారు. ఎప్పుడైతే నిరాకారీ ప్రపంచములో ఉంటారో, అప్పుడు సర్వోత్తమమైన శివ వంశీయులుగా ఉంటారు. కానీ ఎప్పుడైతే బాబా సాకారములోకి వస్తారో, అప్పుడు మీరు బ్రహ్మ ముఖ వంశావళిగా అవుతారు. ఒక్క క్షణములో బాబా ఎలా ఉన్నవారిని ఎలా తయారుచేస్తారు. బాబా అని అనగానే పిల్లలుగా అయిపోయారు. ఏ విధంగా ఆత్మ నోటి ద్వారా మాట్లాడుతుంది కానీ కనిపించదు. అలాగే నేను కూడా ఈ సమయంలో సాకారునిలోకి వచ్చాను, మాట్లాడుతున్నాను. ఎప్పటివరకైతే మీకు శరీరము లభించదో, అప్పటివరకు పాత్రను ఎలా అభినయించగలరు. మీరైతే బాల్యం, యవ్వనము మరియు వృద్ధ అవస్థలలోకి వస్తారు. నేను ఈ అవస్థలలోకి రాను, అందుకే నా జన్మ దివ్యమైనది మరియు అలౌకికమైనది అని అనడం జరుగుతుంది. మీరైతే గర్భంలోకి ప్రవేశిస్తారు. స్వయం నేను చెబుతున్నాను, నేను బ్రహ్మ తనువులోకి, వీరి అనేక జన్మల అంతిమ సమయంలో వానప్రస్థ అవస్థలో ప్రవేశిస్తాను మరియు కూర్చుని మిమ్మల్ని చదివిస్తాను. మిమ్మల్ని మనుష్యులెవ్వరూ చదివించడం లేదు ఎందుకంటే మనుష్యులెవ్వరిలోనూ జ్ఞానము లేదు. పతిత-పావనా రండి అని అంటారు, మరి పతిత పావనుడు ఎవరు? శ్రీకృష్ణుడు సత్యయుగం యొక్క మొదటి రాకుమారుడు. వారు పతిత పావనుడు కాలేరు. మనుష్యులు మరణించేటప్పుడు రామ-రామ అనండి అని అంటారు, ఎవరినైనా ఉరికంబానికి ఎక్కించేటప్పుడు కూడా ఫాదర్లు గాడ్ ఫాదర్ ను గుర్తు చేయండి అని అంటారు ఎందుకంటే గాడ్ ఫాదర్ మాత్రమే సుఖదాత. తండ్రే వచ్చి అన్ని రహస్యాలను అర్థం చేయిస్తారు, ఇప్పుడు ఇది సంగమయుగము మరియు మన సుఖం యొక్క రోజులు రాబోతున్నాయి. 84 జన్మలు పూర్తయ్యాయి. ఇప్పుడు ఇది సంగమము యొక్క మనోహరమైన సమయం. పైకి ఎక్కే యుగము ఇది ఒక్కటే. పైకి ఎక్కేందుకు లిఫ్ట్ లభించడము వంటిది. కానీ ఎప్పటివరకైతే పవిత్రంగా అవ్వరో, స్వదర్శన చక్రధారిగా అవ్వరో, అప్పటివరకు లిఫ్ట్ పై కూర్చోలేరు. ఈ సమయంలో ఇది రెక్కలు లభించడం వంటిది ఎందుకంటే మాయ రెక్కలు తెంచేసింది. ఎప్పుడైతే బాబాకు చెందినవారిగా అవుతారో, బ్రాహ్మణులుగా అవుతారో, అప్పుడే రెక్కలు లభిస్తాయి. ఇప్పుడు సంగమములో బ్రాహ్మణులుగా ఉన్నారు, మళ్ళీ దేవతలుగా అవుతారు. కావున మీరు ఇప్పుడు సంగమయుగవాసులు మరియు సత్యయుగీ రాజధానిలోకి వెళ్ళేందుకు పురుషార్థం చేస్తున్నారు. ఇకపోతే, సుఖం యొక్క రోజులు అందరి కోసం వస్తున్నాయి. మీకు ఓర్పు లభిస్తోంది. మిగిలిన ప్రపంచమైతే ఘోర అంధకారములో ఉంది.

స్వదర్శన చక్రధారీ బ్రాహ్మణ కుల భూషణులు అని తండ్రి మిమ్మల్ని అంటారు. ఇవి ఎవరైనా కొత్తవారు వింటే ఏమంటారంటే, వీరు స్వదర్శన చక్రధారిగా ఎలా అవ్వగలరు? స్వదర్శన చక్రధారి అయితే విష్ణువు కావున ఎంత తేడా

ఉంది. మీ బుద్ధిలో మొత్తం చక్రము ఉంది. ఈ సమయంలో మీరు ఈశ్వరీయ సంతానము మళ్ళీ దైవీ సంతానముగా అవుతారు, ఆ తర్వాత వైశ్య, శూద్ర సంతానముగా అవుతారు. ఈ సమయంలో అన్నింటికన్నా ఉన్నతమైనది ఈశ్వరీయ కులము. వాస్తవానికి మహిమ అంతా శివునిదే. తర్వాత శివ శక్తులది, ఆ తర్వాత దేవతలది ఎందుకంటే మీరు ఈ సమయంలో సేవ చేస్తున్నారు. ఎవరైతే సేవ చేస్తారో వారికే పదవి లభిస్తుంది. మీరు ఆత్మిక సమాజ సేవకులు, దైహిక సమాజ సేవకులు చాలామంది ఉన్నారు. మీకు ఇప్పుడు ఆత్మిక నషా ఉంది, మేము అశరీరిగా వచ్చాము, వచ్చి మా స్వరాజ్యాన్ని తీసుకున్నాము. ఇప్పుడు మీకు తండ్రి ద్వారా జ్ఞానము లభించింది. స్మృతి కలిగింది - దీనినే స్మృతిర్లబ్ధ అని అంటారు. ఇప్పుడు తండ్రే వచ్చి స్మృతినిప్పిస్తున్నారు, మీరే దేవతలుగా, క్షత్రియులుగా అయ్యారు. ఇప్పుడు 84 జన్మల తర్వాత వచ్చి కలుసుకున్నారు. ఇది ఆత్మ మరియు పరమాత్మ యొక్క సంగమయుగీ కుంభ మేళా. పరమాత్మ వచ్చి చదివిస్తున్నారు అనగా సర్వ శాస్త్ర శిరోమణి అయిన గీతా జ్ఞానాన్ని ఇస్తున్నారు. వారు గీతలో శ్రీకృష్ణుని పేరును రాసారు. ఒకవేళ శ్రీకృష్ణుడే అయినట్లయితే అందరూ వారిని అతుక్కొని ఉండేవారు ఎందుకంటే వారిలో చాలా ఆకర్షణ ఉంటుంది. వారు సత్యయుగం యొక్క మొదటి రాకుమారుడు. శ్రీకృష్ణుని ఆత్మ ఇప్పుడు వింటుంది మరియు కృష్ణపురికి చెందిన ఆత్మలు ఎవరైతే ఉన్నారో వారు కూడా వింటున్నారు. మనమే కృష్ణపురికి లేక లక్ష్మీ-నారాయణపురికి చెందినవారమని ఇప్పుడు మీకు స్మృతి కలిగింది. తండ్రి జ్ఞాన సంపన్నులు, తండ్రిలో ఏ జ్ఞానమైతే ఉందో దానిని మనకు ఇస్తున్నారు. ఏ జ్ఞానము? పరమాత్మను బీజ రూపుడు అని అంటారు, కావున మొత్తం వృక్షం యొక్క జ్ఞానాన్ని ఇస్తారు. వారు జ్ఞాన సాగరుడు, కావుననే వారు పతితపావనుడు. మీరు రాసేటప్పుడు అర్థం చేసుకొని రాయండి. మొదట పతిత పావనా అని అనాలా లేక జ్ఞాన సాగరా అని అనాలా? తప్పకుండా జ్ఞానము ఉంది, కావుననే పతితులను పావనులుగా చేస్తారు. కనుక మొదట జ్ఞాన సాగరుడు, తర్వాత పతితపావనుడు అని వ్రాయాలి. వీటిని జ్ఞానసాగరుడైన తండ్రే వినిపిస్తారు, మనుష్యులు 84 జన్మలు ఎలా తీసుకుంటారో వినిపిస్తారు. ఒక్కరికే ఏమైనా చెప్తారా. ఇది రాజయోగము యొక్క పాఠశాల. పాఠశాలలోనైతే చాలామంది ఉంటారు. ఒక్కరికే ఏమైనా చదివిస్తారా. మనం తండ్రి, టీచరు అని అంటాము కావున అనేకులను చదివిస్తారు. లెక్కలేనంతమంది పిల్లలను చదివించడం మీరు చూస్తారు మరియు వృద్ధి జరుగుతూ ఉంటుంది. వృక్షం మెల్ల-మెల్లగా పెరుగుతుంది. కొద్దిగా పెరిగిన తర్వాత పక్షులు తినేస్తాయి. మీరు చూస్తారు, ఈ వృక్షానికి మాయ తుఫాన్లు ఎలాంటివి వస్తాయంటే, మంచి-మంచివారు కూడా చెల్లాచెదురైపోతారు. బాబా ప్రారంభములో పిల్లల యొక్క ఇటువంటి నడవడికను చూసేవారు, అప్పుడు, నీ నడవడిక ఇలా ఉంది, నీవు నిలవలేవు, అందుకే శ్రీమతముపై నడవండి అని చెప్పేవారు. వారు - ఏమి జరిగినా సరే మేము పారిపోము అని అనేవారు. అయినా సరే వారు పారిపోయారు. కావుననే ఆశ్చర్యం కలిగేలా వింటారు, వినిపిస్తారు, పారిపోతారు అని గాయనం చేయబడింది. అది మీరు ప్రాక్టికల్ గా చూస్తున్నారు. ఇలా జరుగుతూ ఉంది ఎందుకంటే మాయ ఎదురుగా నిలబడి ఉంది, మల్లయుద్ధం జరుగుతుంది. రెండు వైపుల నుండి పహిల్వాన్లు ఉంటారు. అప్పుడు ఒకసారి ఒకరి ఓటమి, ఒకసారి ఒకరి గెలుపు. ఇప్పుడు మీకు మాయతో యుద్ధం జరుగుతుంది. మాయతో గెలుపొంది మీరు రాజ్యాన్ని స్థాపన చేస్తున్నారు.

తండ్రి అంటారు - ఈ బాంబులు వినాశనానికి గుర్తు. కడుపు నుండి ముసలాలు వెలువడి తమ కులాన్ని వినాశనం చేసాయని శాస్త్రాలలో రాయబడి ఉంది. మీకు తెలుసు - పావన ప్రపంచాన్ని తయారుచేసేందుకు బాబా వచ్చారు. కావున పాత ప్రపంచం యొక్క వినాశనం తప్పకుండా జరగాలి. లేకపోతే మనం రాజ్యం ఎక్కడ చేస్తాము. ఈ చదువు యొక్క ప్రారబ్ధము భవిష్య కొత్త ప్రపంచము కోసము ఉంది. మిగిలినవారు ఏదైతే పురుషార్థం చేస్తారో, అది ఈ ప్రపంచము కోసము. సన్యాసులు ఏదైతే పురుషార్థం చేస్తారో, అది కూడా ఈ ప్రపంచం కోసమే. మీరు అంటారు - మేము ఇక్కడకు వచ్చి రాజ్యం చేస్తాము. కానీ గుప్త రూపం ఉన్న కారణంగా ఘడియ-ఘడియ పిల్లలు మర్చిపోతారు. లేదంటే గొప్ప వ్యక్తులు ఎక్కడికైనా వెళ్తే వారిని ఎంతగా స్వాగతం చేస్తారు. లండన్ నుండి రాణి వస్తే, ఎంత ఘనంగా స్వాగతం చేసారు. కానీ తండ్రి ఎంత పెద్ద అథారిటీ, అయినా పిల్లలకు తప్ప ఇంకెవరికీ తెలియదు. మనం చూపించలేము కూడా ఎందుకంటే ఇది కొత్త విషయము. ఇక్కడకు బ్రహ్మ ఎక్కడి నుండి వచ్చారు? అని మనుష్యులు తికమకపడతారు కూడా. ఎందుకంటే ఈ రోజుల్లో చాలా టైటిళ్ళు పెడుతున్నారు. బాబా అంటారు - ఇది అంధకారమయమైన నగరము... ఏమీ తెలియదు. ఒకవేళ సాధువులకు, సన్యాసులకు, గురువులకు తండ్రి వచ్చారని తెలిస్తే, ఎవరినైతే మనం సర్వవ్యాపి అనేవారమో, వారిప్పుడు వచ్చి ముక్తి-జీవన్ముక్తులను ఇస్తున్నారని తెలిస్తే, వారు వచ్చి తీసుకోవడం మొదలుపెడతారు, కాళ్ళు ఎలా పట్టుకుంటారంటే, దానిని నేను వదిలించుకోలేకపోతాను కూడా. ఇలా జరిగితే వీరి వద్ద ఇంద్రజాలం ఉంది, ఈ గురువు బుద్ధి పాడైపోయింది అని అందరూ అంటారు. కానీ ఇప్పుడు అలా జరగదు, ఇది చివర్లో జరుగుతుంది. కన్యలు భీష్మ పితామహునికి బాణాలు వేసారని అంటారు కదా. బాణం వేస్తే గంగ వెలువడినట్లు కూడా

చూపిస్తారు. కావున చివర్లో అందరికీ జ్ఞానామృతాన్ని తాగించినట్లు నిరూపించబడుతుంది. మనుష్యులకైతే ఏమీ తెలియదు. పరమాత్మ సర్వవ్యాపి అని అంటారు. బుద్ధుడిని కూడా సర్వవ్యాపి అని అంటారు. దీనిని రాతి బుద్ధి అని అంటారు. ఇంతకుముందు నేను కూడా రాతి బుద్ధిగా ఉండేవాడిని. కావున తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు - గాడ్ ఫాదర్ ను ఎప్పుడూ సాకారీ లేక ఆకారీ అని అనరు, వారు నిరాకారుడు. వారిని సుప్రీమ్ సోల్ అని అంటారు. అర్ధకల్పం మీరు భక్తి చేసారు. భక్తి చేస్తూ-చేస్తూ భగవంతుడు తప్పకుండా లభిస్తారని అంటారు కదా, అంటే తప్పకుండా భక్తి చేస్తూ-చేస్తూ దుర్గతిని పొందారు, ఆ తర్వాత సద్గతిని ఇచ్చేందుకు తండ్రి వస్తారు. సర్వుల సద్గతిదాత అని కూడా అంటారు కదా. పరమాత్మ ఎప్పుడు మరియు ఏ రూపంలో వచ్చారు అన్నది మనుష్యులకు ఏమైనా అర్థమవుతుందా, ద్వాపర యుగంలో శ్రీకృష్ణుని రూపంలో వస్తారని అంటారు, దీనిని ఘోర అంధకారము అని అంటారు. కుంభకర్ణుడిని నిద్ర నుండి మేల్కొల్పితే, అతడు మేలుకోలేదు అని అంటారు కదా. కావున తండ్రి ఇప్పుడు ఏమని డైరెక్షన్ ఇచ్చారంటే - పవిత్రంగా అవ్వండి మరియు భగవంతుడి నుండి డైరెక్టుగా గీతను వినండి. 7 రోజులు క్వారన్టైన్ లో కూర్చోబెట్టండి. దానమిచ్చినట్లయితే గ్రహణం తొలగుతుంది. ఇప్పుడు అందరికీ 5 వికారాల గ్రహణం పట్టి ఉంది కావుననే పతితులుగా అయ్యారు. ఇది రావణ రాజ్యం కదా. ఇప్పుడు తండ్రి అంటారు - పిల్లలూ, మీరు నా వారిగా అవ్వండి, ఇంకెవరూ లేరు. శ్రీ శ్రీ 108 వారి శ్రీమతముపై నడవడం ద్వారా మీరు 108 విజయ మాలలోని మణిపూసలుగా అవుతారు. నేను మాలలోని మణిపూసగా అవ్వను. నేనైతే అతీతమైనవాడను, దానికి గుర్తు పుష్పము. జంట పూసలుగా బ్రహ్మా-సరస్వతి అవుతారు. ప్రవృత్తి మార్గం కదా. నివృత్తి మార్గం వారు మాలలోని మణిపూసలుగా అవ్వలేరు. అయితే, పవిత్రతను ధారణ చేసినా కూడా మంచిదే. కానీ ఈ గురువులు సద్గతిని ఇవ్వలేరు. సద్గతిదాత ఒక్క సద్గురువే. సద్గురువును అకాల్ (కాలం చేయనివారు) అని అంటారు, సద్గురువు అని ఒక్క పరమాత్మనే అంటారు. సాకార గురువులు అకాలమూర్తులుగా ఏమైనా అవ్వగలరా. లౌకిక తండ్రిని, శిక్షకుడిని, గురువును మృత్యువు కబళిస్తుంది. నన్ను అయితే మృత్యువు కబళించలేదు. బాబా ఎన్ని మంచి-మంచి విషయాలను అర్థం చేయిస్తారు, ఎవరైతే ఇంత సహజమైన విషయాలను అర్థం చేసుకోలేరో, అటువంటివారికి బాబా ఇలా అంటారు - అచ్ఛా, తండ్రిని స్మృతి చేయండి. చక్రాన్ని కూడా స్మృతి చేయాల్సి ఉంటుంది. తండ్రితో పాటు వారసత్వాన్ని కూడా స్మృతి చేయాల్సి ఉంటుంది. తండ్రిని స్మృతి చేసినట్లయితే వికర్మలు భస్మమవుతాయి. తండ్రి అయితే సమ్ముఖంలోకి వచ్చి ఉన్నారు. తండ్రిని అశరీరి అని అంటారు. బ్రహ్మా, విష్ణు, శంకరులు అందరికీ తమ తమ శరీరాలు ఉన్నాయి. నాకు నాదంటూ శరీరము లేదు. మీకైతే మామయ్యలు, పెదనాన్నలు అందరూ ఉన్నారు. నాకైతే మామయ్య, చిన్నాన్న ఎవరూ లేరు. నేను కూడా వస్తాను. కానీ మీరెలా వస్తారు, నేనెలా వస్తాను. గాడ్ ఫాదర్ అని పిలుస్తారు. కానీ ఎక్కడి నుండి వస్తాను? పరంధామం నుండి వస్తాను. అక్కడి నుండే మీరు వస్తారు, దానిని బ్రహ్మాండము అని అంటారు. ఈ సమయంలో మీరు బ్రహ్మా ముఖవంశావళి రుద్ర యజ్ఞం యొక్క రక్షకులు. రాజయోగ శిక్షణను ఇచ్చేవారు, రాజయోగాన్ని నేర్పించే మీరు శిక్షకులు అయినట్లు కదా. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మాలలోని మణిపూసలుగా అయ్యేందుకు, నాకు ఒక్క శివబాబా తప్ప ఇంకెవ్వరూ లేరు అన్న ధారణను పక్కా చేసుకోవాలి. స్మృతిర్లబ్ధగా అవ్వాలి.

2. శ్రీ శ్రీ 108 శివబాబా యొక్క శ్రీమతముపై పూర్తిగా నడవాలి. నాది-నాది అన్నది వదిలి గ్రహణము నుండి ముక్తులుగా అవ్వాలి.

వరదానము:- బ్రాహ్మణ జీవితంలో సదా సుఖాన్ని అనుభవం చేసే మాయాజీత్, క్రోధముక్త భవ

బ్రాహ్మణ జీవితంలో ఒకవేళ సుఖాన్ని అనుభవం చేయాలంటే క్రోధాన్ని జయించేవారిగా అవ్వడము చాలా అవసరము. ఎవరైనా నిందించినా కానీ, అవమానపర్చినా కానీ మీకు కోపం రాకూడదు. ఆవేశపడడం కూడా క్రోధం యొక్క అంశమే. అలాగని కోపం చేయాల్సి వస్తుంది, లేకపోతే పనే జరగదు అని కాదు. ఇప్పటి సమయమనుసారంగా కోపం వల్ల పని పాడవుతుంది మరియు ఆత్మిక ప్రేమతో, శాంతితో పాడైన కార్యం కూడా బాగవుతుంది, అందుకే ఈ క్రోధాన్ని చాలా పెద్ద వికారంగా భావించి

మాయాజీతులుగా, క్రోధముక్తులుగా అవ్వండి.

స్లోగన్:- మీ వృత్తిని ఎంత శక్తిశాలిగా చేసుకోవాలంటే, అనేకాత్మలు మీ వృత్తితో యోగ్యులుగా మరియు యోగులుగా అవ్వాలి.